ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 3
బుధవారం 29 జనవరి 2025







**ప్రజా సంక్షేమానికి కృషి**

కూటమి ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమ కోసం అహర్నిశలు కృషి చేస్తోంది. భవిష్యత్తులో కూడా మరింత కాలనీల అభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తాం. పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించేలా చూస్తాం.

- పిడతల సుధాకర్, జనసేన పార్టీ, జిల్లా సమన్వయకర్త



**అర్హులందరికీ ఇంటి పట్టాలు..**

మా వార్డులో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు ఉండే విధంగా కృషి చేస్తాం. ఎవరైనా అక్రమంగా పట్టాలు పొంది ఉంటే వారిపై అధికారులకు ఫిర్యాదు చేసి రద్దు చేయిస్తాం. మంత్రి ఆశీస్సులతో యువనాయుడు ఎన్ఎండీ ఫీరోజ్ సహకారంతో మా వార్డును రాబోవు రోజుల్లో మరింతగా అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తాం.

బుగ్గరాముడు, టీడీపీ 38వ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్ కాలనీ




**కమ్యూనిటీ హాల్ నిర్మించాలి**

కుల మతాలకు అతీతంగా 30 సెంట్లలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలి. ఈ మూడు కాలనీల్లో చాలా మంది పేదలు ఉన్నారు. వారందరికీ అనుకూలంగా ఉండే విధంగా శాశ్వతంగా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తే రుణపడి ఉంటాం.

-ఉమాకాంత్, టీడీపీ సీనియర్ నాయకుడు, 37వ వార్డు

# కాలనీల అభివృద్ధికి కృషి

- త్వరలోనే రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తాం
- వీధి లైట్లు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తాం
- కాలనీల ప్రజలకు ఉపాధి కల్పిస్తాం
- అందరికీ అనుగుణంగా కమ్యూనిటీ హాల్
- నంద్యాలను ప్రగతి పథంలో నిలుపుతాం
- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' చర్చా వేదికకు అనూహ్య స్పందన



క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంలో ఇది వినూత్న ప్రయోగం. ప్రజా జీవితంలో పాత్రికేయ రంగాన్ని సృజనాత్మక భాగస్వామిని చేయడానికి ఆంధ్రజ్యోతి ముందుకు వచ్చింది. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా అనే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టింది. దీని ద్వారా స్థానిక ప్రజలు తమ సమస్యలను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినిపించే సమన్వయపాత్ర పోషించింది. ప్రజలు తమ సమస్యల జాబితాను ప్రకటించే అవకాశం కల్పించడమే కాక కొన్ని అక్కడికక్కడే పరిష్కారం కావడానికి దోహదం చేసింది. సమస్యలపై వార్తలు, కథనాలు అందించడమేగాక పరిష్కారానికి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసే ఉమ్మడి వేదికగా ఆంధ్రజ్యోతి ఈ కార్యక్రమం చేపట్టింది. తద్వారా తన సామాజిక బాధ్యతను విస్తరించుకున్నది. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 37, 38వ వార్డులలోని నందమూరినగర్, వైఎస్సార్ కాలనీ, ఎస్ఆర్‌బీసీ కాలనీ చర్చా వేదికను నిర్వహించింది.






నంద్యాల, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 37, 38వ వార్డులలోని నందమూరినగర్, వైఎస్సార్ కాలనీ, ఎస్ఆర్‌బీసీ కాలనీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం సదరు కాలనీలను ఏమాత్రం పట్టించుకో లేదని విమర్శించారు. ఈ మేరకు ఆంధ్రజ్యోతి తలపెట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' చర్చా వేదిక కార్యక్రమాన్ని మంగళవారం నందమూరినగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆయన హాజరయ్యారు.



ప్రజలకు నమస్కరిస్తున్న ఫిరోజ్

## సమస్యల వెల్లువ

ముందుగా ఆయా కాలనీల ప్రజలు వివిధ సమస్యలను ఫిరోజ్‌కు వినిపించడంతో పాటు తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన మాట్లాడుతూ.. ఈ కాలనీలు ఏర్పడి ఏళ్లు గడిచిన ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని గుర్తు చేశారు. గత వైసీపీ హయాంలో ఇక్కడ చాలా అక్రమాలు జరిగాయన్నారు. వీటిన్నంటిని కూడా త్వరలో చక్కదిద్దుతామన్నారు. ప్రధానంగా త్వరలో ఈ రెండు వార్డులలో పలు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి విద్యుత్ లైట్లు, తాగునీటి సమస్యల లేకుండా చూస్తా మని హామీ ఇచ్చారు. తక్షణమే పాములు, దోమల బెడద లేకుండా మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి కాలనీలను పరిశుభ్రంగా ఉంచుతామన్నారు. స్థానికులకు ఉపాధి కల్పించే దిశగా అందరికీ అనుకూలంగా ఉండే విధంగా ఒక పరిశ్రమను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలకు కూడా ప్రత్యేక చిన్నతరహా పరిశ్రమను ఏర్పాటు చేసే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామన్నారు. ఈ వార్డులకు వచ్చే ప్రధాన రహదారిలోని కుందు బ్రిడ్జిని త్వరలోనే పూర్తి చేయడంతో పాటు నంద్యాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రగతి పథంలో నిలుపుతామన్నారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. వార్తలను ప్రచురించడమే కాకుండా ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారించే దిశగా యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా అనే కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని గుర్తు చేశారు.

వివరాలు 4వ పేజీలో



చర్చా వేదికకు హాజరైన ప్రజలు



చర్చా వేదికలో నాయకులు



ప్రజలతో మాట్లాడుతున్న ఫిరోజ్



## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదికపై మంగళవారం అనంతపురం ధర్మవరానికి చెందిన శ్రీలలిత నృత్య కళానికేతన్ వారిచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించారు. ఇందులో భాగంగా మహాగణపతిం, నటరాజ నర్తనం, త్రినేత్ర సుందర, నటరాజ ప్రణవనాదం, అదిగదిగో శ్రీశైలం, శివతాండవం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. కాగా స్వామి, అమ్మవార్ల కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిత్య కళారాధనలో భాగంగా ప్రతిరోజు హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.




నృత్యం చేస్తున్న కళాకారులు

## ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి సహకారం

**ప్రభుత్వ మైనార్టీ సలహాదారు మహమ్మద్ షరీఫ్ అహమ్మద్**

కర్నూలు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి ప్రభుత్వ సహకారం ఉంటుందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షరీఫ్ అహమ్మద్ అన్నారు. మంగళవారం అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని సందర్శించారు. ఇన్‌చార్జి ఉపకులపతి పిఎస్ షావలీఖాన్, రిజిస్ట్రార్ లోకనాథ్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. పవర్ పాయింట్ ద్వారా అభివృద్ధి, నిలిచిన నిర్మాణాలకు నిధుల అవశ్యకత, ప్రస్తుత పరిస్థితి, విద్యార్థుల విజయాలు తదితర అంశాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి కావాల్సిన మౌలిక వసతులను కల్పించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళతామని అన్నారు. వసతి గృహం, రెగ్యులర్ సిబ్బంది నియామకం, పిహెచ్‌డీ కోర్సులకు అవకాశాలు కల్పించాలని, లైబరీలో పోటీ పరీక్షల పుస్తకాలు, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు, కొత్త కంప్యూటర్లు సమకూర్చాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించడంతో పాటు తదితర మౌలిక వసతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఒకేషనల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ సెంటర్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వీసీ వివరించారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లించేందుకు పరిష్కార మార్గం చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. గత ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యానికి గురైన ఉర్దూ యూనివర్సిటీ పెండింగ్ నిర్మాణాల కోసం నిధులను సీఎంతో మాట్లాడి మంజూరు చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ ఆహ్మద్, కర్నూలు ఆర్డీవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహమ్మద్ షరీఫ్ అహమ్మద్

## 268 మంది ఎంపిక



పరుగు పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులు

కర్నూలు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం 17వ రోజు కొనసాగింది. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 569 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజకల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 317 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 126 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 261 మంది అర్హత సాదించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 17వ రోజు 268 మంది అర్హత సాధించారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెల్లారిన బతుకులు

- గ్యాస్ లీకేజీ ఘటనలో నానమ్మ, మనవడి దుర్మరణం
- 9 మందికి గాయాలు
- కుప్పకూలిన మూడు ఇళ్లు
- రూ.24 లక్షల ఆస్తి నష్టం
- చాపిరేవులలో విషాదం



కుప్పకూలిన ఇళ్లు

వివరాలు 5లో

## 20 సూత్రాల కార్యక్రమాలను నిర్వహించండి

చైర్మన్ లంకా దినకర్

4

# ఇన్ని సమస్యలు

కర్నూలు ఎడ్యుకేషన్/న్యూసిటీ/ కర్నూలు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో కొన్ని సమస్యలను అధికారులు వెంట వెంటనే పరిష్కరించారు. వీధిలైట్ల మరమ్మతులు, తాగునీరు పైపులైన్ల మరమ్మతులకు వెంటనే చర్యలు చేపట్టారు. అలాగే కాలనీలో ఆకతాయిల బెడద, మందుబాబుల ఆగడాలపై మంగళవారం సాయంత్రం నుంచే చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు. కొన్ని కాలనీలను కలిపే రోడ్లకు రూ.2 లేదా 3 లక్షలతో గ్రావెల్ రోడ్లు వేయించడం, వీధి లైట్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు వెంటనే తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్‌ను పంపించి క్లీన్ చేయిస్తామన్నారు. కల్వర్టులు, కాలువల క్లీనింగ్ కోసం వీలైనంత ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తామని అన్నారు. కాలనీ వాసులు చెప్పిన ప్రతి సమస్యను అధికారులు నోట్ చేసుకున్నారు.

**సమస్యల వెల్లువ :** ఆంధ్రజ్యోతి వినూత్న రీతిలో చేపట్టిన అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమానికి రుక్మిణి నగర్, వాసు నగర్, సాయినాథ్ నగర్, విజయ నగర్, ఉద్యోగ నగర్, సొసైటీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఈ సదస్సులో సుమారు 28 మంది తమ తమ కాలనీలోని సమస్యలపై స్పందించారు. సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను, కమిషనర్‌ను కోరారు. 20 ఏళ్ల కింద ఈ కాలనీలు ఏర్పాటయ్యాయని, ఏ ఒక్కరూ ఇలా ముందుకు వచ్చి సమస్యలు వినలేదని ప్రజలు అన్నారు. డ్రైనేజీ, కుక్కల బెడద, మరి కొందరు ఆకతాయిలు, దొంగతనాల బెడద, విద్యుత్, తాగునీటి సమస్యలు, పాము సమస్యలవంటివి పెద్ద జాబితాను కాలనీవాసులు తీసుకువచ్చారు. సదస్సులో కూర్చుని సమస్యలు వింటున్న ఎమ్మెల్యే, కమిషనర్‌లు సైతం ఇన్ని సమస్యలు ఉన్నాయా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, సిటీ ప్లానర్ ప్రదీప్, నాలుగో పట్టణ ఎస్ఐ గోపీనాథ్, శారద స్కూల్ కరస్పాండెంట్ జి.నందిని, సత్యసాయి సప్లయర్స్ అధినేత రామకృష్ణ, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్ గోపాల్, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి, ఏబీఎన్ ప్రతినిధి సుంకన్న పాల్గొన్నారు.


నగరపాలక సంస్థ కమిషనర్‌తో కలిసి వాసునగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

### సప్తగిరి కాలనీలో రోడ్డు పనులు సత్వరమే చేపట్టాలి

సప్తగిరి కాలనీకి సిమెంటు రోడ్డు మంజూరైంది. అధికారులు పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు స్పందన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్ళాం. మున్సిపల్ అధికారులు టెండర్లు పిలిచి పనులు చేపడుతామని చెప్పారు. ఈ పనులను ఏమైనా రద్దు చేశారా? మాకు తెలియదు. అధికారులు వివరాలు చెప్పాలి. పనులు చేయించాలి.

- కె. బజారప్ప, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

### డ్రైనేజీ అస్తవ్యస్తం

72, 73 సచివాలయాల పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అరుణానగర్‌లోని కాలువలు చిన్నగా ఉండటంతో మురుగునీరు వీధుల్లో పారుతోంది. కాలనీలోని ఖాళీ స్థలాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దీంతో దోమలబెడదను భరించలేకపోతున్నాము. అలాగే 29 వార్డు పరిధిలో అర్హులైన నిరుపేదలకు వడ్డీ లేని రుణాలు అందడం లేదు. నేషనల్ హైవేలో రాత్రివేళల్లో లైట్లు వెలగడం లేదు.

- వీరప్ప, బీజేపీ ఓబీసీ నాయకుడు

### తాగునీరు అందించాలి

శరీన్‌నగర్‌లో ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో నివసించేవారంతా కూలీ చేసుకుని జీవించేవారే. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో తాగునీరు విడుదల చేస్తున్నారు. పనులకు వెళ్లడంతో తాగునీరు పట్టుకోలేకపోతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అమృత్ పథకం ద్వారా తాగునీటి కోసం రూ.120 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో గోరుకల్లు రిజర్వాయర్, హంద్రీ కాలువ నుంచి నీటిని సరఫరా చేసి కాలనీవాసులకు తాగునీరు పుష్కలంగా అందించాలి. వేసవిలో తాగునీటి సమస్య నుంచి ప్రజలను గట్టెక్కించాలి. పందిపాడు, లక్ష్మీపురం మధ్య రోడ్డును నిర్మించాలి.

- కొట్టె చెన్నయ్య, రిటైర్డు ప్రిన్సిపాల్, బీజేపీ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి

### పార్కు ఏర్పాటు చేయాలి

విజయనగర్ కాలనీలో అన్ని సమస్యలే ఉన్నాయి. ప్రధానంగా ఉదయం, సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కు ఏర్పాటు చేయాలి. పార్కు లేకపోవడంతో చిన్నారులు బయట ఆడుకుంటూ వాహనాల కింద పడి దెబ్బలు తగిలించుకుంటున్నారు.

-రవికుమార్

### పైపులైన్ పగిలిపోయింది.

పార్థసారథి నగర్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పైప్‌లైన్ పగిలిపోయి నీరంతా వృథాగా పోతోంది. కాలువలు వారానికి ఒక్కసారి శుభ్రం చేస్తున్నారు. సనత్‌నగర్‌లోని ఖాళీస్థలంలో చెత్తను పడేసిపోతున్నారు.

-సద్దాంహుస్సేన్

### అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

కాలనీలోని వాటర్ ట్యాంకు వద్ద లైట్లు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తాగుబోతులు అక్కడే ఉండటంతో మహిళలు, చిన్నారులు అటువైపు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. దోమల బెడద నుంచి రక్షించండి. జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఆకతాయిలు ఎక్కువగా ఉంటున్నారు.

- షబ్బీర్

### నీటి సమస్య పరిష్కరించాలి

సప్తగిరి నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి. అదే విధంగా రోడ్లు, కాలువలు నిర్మించాలి. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

-అరుణకుమారి

### ఇళ్ల ముందు చెత్తను పడేస్తున్నారు

శారదపాఠశాల వెనకాలే మా ఇల్లు ఉంది. అక్కడ కేవలం రెండు ఇళ్లు మాత్రమే ఉన్నాయి. మిగతా అంతా ఖాళీ స్థలమే. దీంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఉదయం, రాత్రి సమయాల్లో చెత్త పడేస్తున్నారు. రాత్రి పూట తాగుబోతులు ఈ ఖాళీ స్థలంలో కూర్చుని మందు తాగుతున్నారు.

-లలితమ్మ

### ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

శరీన్‌నగర్ నుంచి జాతీయ రహదారి మీదుగా రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లడం చాలా కష్టంగా ఉంది. ఇక్కడ ఒక ఫ్లైఓవర్ బ్రిడ్జి నియమించాలి. ప్రతి రోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కూలీలు, ఇతర పనులకు శరీన్‌నగర్ నుంచి జాతీయ రహదారి దాటుకుని వెళ్లడానికి అవస్థ పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

-శ్రీనివాసరావు


కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు



### డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది

కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. కాలువలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి వచ్చి దుర్వాసన వెలజల్లుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నాం.

-సుంకన్న

# ఇప్పటికైనా పరిష్కరించండి

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'లో ప్రజల వినతి

నంద్యాల, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆంధ్రజ్యోతి చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' చర్చా వేదికలో కోరారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టడంపై ఆయా కాలనీల ప్రజలు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా కాలనీల ప్రజలు ఎంతో ఉత్సాహంగా వచ్చి స్వచ్ఛందంగా తమ సమస్యలను తెలియ జేశారు. ఇప్పుడైనా తమ సమస్యలు పరిష్కారమైతే ఆంధ్ర జ్యోతికి రుణపడి ఉంటామని ఆయా కాలనీల ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. నగర శివారు కాల నీలో సమస్యలన్నీ ఒక్కసారిగా ఈ వెలుగులోకి వచ్చా యి. వీటన్నిటినీ పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.


కార్యక్రమానికి హాజరైన ప్రజలు

### సమస్యల పరిష్కారానికి కృషి

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తాం. ప్రధానంగా మంత్రి చొరవతో 37,38 వార్డుల అభివృద్ధికి కృషి చేస్తాం.

- ఖలీల్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు

### అభివృద్ధి చేయాలి

గతంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఇచ్చిన హామీల ప్రకారం కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి. ఇటీవల కూడా పర్యాటించి వెళ్లారు. త్వరలోనే చేస్తామని కూడా చెప్పారు. మా సమస్యలను త్వరగా పరిష్కరిస్తే ఎప్పటికి తమకు ఋణపడి ఉంటాం.

-బాబురావు, నందమూరినగర్

### రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి

ఏళ్ల తరబడి కాలనీలో రోడ్లు గుంతలమయంగా.. డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడిక్కడ రోడ్లపై మురుగునీరు చేరుతోంది. తద్వారా దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద ఎక్కువైంది. రోడ్లు, డ్రైనేజీలు త్వరగా నిర్మించాలి.

-అనూష, వైఎస్సార్ కాలనీ

### విష పురుగులు వస్తున్నాయి

కాలనీలో చాలా ప్రాంతాల్లో ఇల్లు నిర్మించకపోవడంతో ఖాళీగా ప్లాట్లు ఉన్నాయి. దీంతో ఆయా ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి పాములు, తేళ్లు వస్తున్నాయి. బయటకు రావాలంటే భయంగా ఉంది. త్వరలో పిచ్చిమొక్కలను తొలగించి ప్రజలకు రక్షణ కల్పించాలి.

-ఇజ్రాయిల్, నందమూరినగర్

### శ్మశానానికి రోడ్డు వేయాలి

కాలనీలో శ్మశానానికి వెళ్లడానికి కూడా రహదారి సక్రమంగా లేదు. వర్షాకాలం వస్తే ఇబ్బందికరంగా ఉంది. కావున మా సమస్యపై స్పందించి తాత్కాలిక రోడ్డును నిర్మించాలి.

- సురేష్ కుమార్, వైఎస్సార్ కాలనీ

### మహిళలకు ఉపాధి కల్పించాలి

కాలనీలో చాలా మంది పేదవారు ఉన్నారు. మహిళలకు ఉపాధి సౌకర్యం లేదు. కావున స్థానికంగా మహిళలకు ప్రత్యేక పరిశ్రమ ఏర్పాటు చేసి అండగా నిలవాలి. పొదుపు మహిళలకు భవనం నిర్మించాలి.

-సుజాత, వైఎస్సార్ కాలనీ

### దోమల నివారణ చర్యలు తీసుకోవాలి

మా కాలనీలో చాలా చోట్ల మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉంది. దోమలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో జ్వరాల బారిన పడుతున్నారు. కావున తరచూ ఫాగింగ్ చేసి దోమలు లేకుండా చూడాలి. ఈ కాలనీలకు సంబంధిత శాశ్విత డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి.

-లక్ష్మీనారాయణ, నందమూరినగర్

### అల్లరిమూకలు ఆగడాలు ఎక్కువయ్యాయి

నందమూరినగర్‌లోని టైలర్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి వెంబడి అల్లరి మూకలు ఆగడాలు ఎక్కువయ్యాయి. రాత్రి పూట వెళ్లాలంటే భయంగా ఉంది. మహిళలకు మరీ ఇబ్బందిగా ఉంది. పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలి.

- వలి, నందమూరినగర్

### అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి

కాలనీలో చాలా వరకు బుడగ జంగాల కులానికి చెందిన వారు జీవిస్తున్నాం. మాకు అంగన్‌వాడీ స్కూల్ లేదు. మా పిల్లలకు ఇబ్బందిగా ఉంది. కావున మా సమస్యపై స్పందించి అంగన్‌వాడీ స్కూల్ ఏర్పాటు చేయాలి.

-ప్రసాద్, వైఎస్సార్ కాలనీ

### రోడ్డు సౌకర్యం లేదు

వైఎస్ఆర్‌కాలనీ నుంచి టైలర్స్ కాలనీకి వెళ్లే రహదారి గుంతలమయంగా ఉండటంతో పాటు రోడ్డు వెంబడి ముళ్ల కంప ఏపుగా పెరిగిపోయాయి. రాత్రి వేళ వెళ్లాలంటే భయంగా ఉంది. వీధిలైట్లు కూడా లేవు. కావున ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలి.

- మంజుల, వైఎస్సార్ కాలనీ

## 1న ఇళ్ల పంపిణీ

కర్నూలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1వ తేదీన జిల్లాలో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులకు అందించే కార్యక్రమం నిర్వహణపై ఎంపీడీవోలతో, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయడంతో పాటు రాష్ట్రంలో లక్ష ఇళ్ల నిర్మాణాలలో భాగంగా జిల్లాలో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 20 సూత్రాల కార్యక్రమాలను నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

నంద్యాల కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్య సాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని 20 సూత్రాల పార్ములా కమిటీ చైర్మన్ లంకా దినకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల జిల్లా అధికారులతో చైర్మన్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, సీపీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. లంకా దినకర్ మాట్లాడుతూ పీఎం నరేంద్రమోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వికసిత్ నంద్యాల జిల్లాగా రూపుదిద్దేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.113 కోట్ల రూపాయలకు గాను రూ.92 కోట్లు ఖర్చుపెట్టారని ఇంకా రూ.21 కోట్లు ఖర్చుచేయాల్సి ఉందని నిధులు మురిగిపోకుండా ప్రణాళిక విధంగా ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. గత 5 సంవత్సరాలలో మెటీరియల్ కాంపోనెంట్ వ్యయంలో తేడాలు ఉన్నందున విచారణ చేయాల్సిందిగా చైర్మన్ కలెక్టర్‌ను సూచించారు. ఉపాధి వేతన దారుల కూలీ రూ.300 రూపాయలు అయితే జిల్లాలో సగటున రూ.246 మాత్రమే ఉందని, దినసరి సరాసరి రేటును పెంచేందుకు సరైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జలజీవన్ మిషన్ కింద రూ. 400 కోట్లతో 1568 పనుల ప్రారంభించగా అందులో 1203 పనులు రద్దుచేసిందన్నారు. టిడ్కో గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను ప్రభుత్వానికి నివేదించి పనులు చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాలలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సరఫరా కోసం అమృత్-1 కింద158 కోట్ల అంచనాలతో కేటాయించిన 98

### చైర్మన్ లంకా దినకర్

పనులకుగాను రూ.144 కోట్లు ఖర్చు చేసారని పెండింగ్లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. నంద్యాలలో 72వేల గృహాలకు 69వేల కొళాయి కనెక్షన్లు ఉన్నాయని మిగిలిని వాటికికూడా వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. డోన్ మున్సిపాలిటీలో అమృత్-2 ద్వారా నీటి సరఫరా కోసం రూ. 23.56 కోట్లు, బేతంచెర్లలో 45 కోట్లు కేటాయించారని పనులు వేగవంతంచేసి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. పీఎం ఫసల్ బీమా యోజన పథకం కింద గత 5 సంవత్సారాల్లో నష్టపోయిన రైతులకు ఆర్థిక ప్రయోజనాలు అందలేదన్నారు. ప్రతి యూరియా బ్యాగ్‌పై 2వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. నల్లమల్ల అడవులో వైల్డ్‌లైఫ్ సెంచురీ, జంగిల్ సఫారీకి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లాలోని 11300 వీధి వ్యాపారులకు రుణాలు మంజూరుచేసి ఆదుకోవాలని అన్నారు. ఎంపీ శబరి మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో సిద్ధేశ్వరం వద్ద కృష్ణానదిపై తీగల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.

# తెల్లారిన బతుకులు

- గ్యాస్ లీకేజీ ఘటనలో నానమ్మ, మనవడి దుర్మరణం
- 9 మందికి గాయాలు
- అధిక పీడనంతో కుప్పకూలిన మూడు ఇళ్లు
- రూ.24 లక్షల ఆస్తి నష్టం
- చాపిరేవులలో విషాదం



క్షతగాత్రులను వెలిసికి తీసున్న సిబ్బంది



మృతులు



రోదిస్తున్న మహిళ

**నంద్యాల క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** కూలి పనులకు వెళితేగాని పొట్ట నిండని బతుకులు.. సోమవారం కూలి పనులకు వెళ్లి రాత్రి నిద్రకు ఉపక్రమించారు. తెల్లారి వంట చేసుకొని పనికి వెళ్లాల్సిన నానమ్మ, బడికి వెళ్లాల్సిన మనవడిని మరణం వెంటాడింది. వెంకటమ్మ తెల్లవారు జాము 4గంటలకు లేచి ఇంట్లో లైట్ వేయడంతో గ్యాస్ లీకేజీవల్ల ఏర్పడిన అధిక పీడనంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అధిక పీడనంతో పక్కనే ఉన్న ఆమె కుమారులకు చెందిన మరో రెండు ఇళ్లు కుప్పకూ లడంతో ఆ శబ్దానికి ఒక్కసారిగా చాపిరేవుల గ్రామం ఉలిక్కిపడింది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ అక్కడి కక్కడే మృతిచెందగా ఆమె మనవడు కుప్పకూలిన శిథిలాల మధ్య ఇరుక్కుపోయి మృత్యువాత పడ్డాడు. 9 మంది కాలిన గాయాలతో పాటు శ్లాబ్‌లు కూలి నిద్రి స్తున్న వీరిపై పడడంతో తీవ్ర గాయాలకు గురయ్యారు. ఈ విషాదకర ఘటన నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో జరిగింది.

నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో మంగళవారం తెల్లవారుజా ము 4గంటల సమయంలో ఇంట్లో గ్యాస్ లీకేజీ అయిన ఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరో 9మంది కాలిన గాయాలు అయ్యాయి. వీరిని నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న వారికి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటమ్మ(62), ఆమె ఇద్దరు కుమారులు సుబ్బరాయుడు, లింగమయ్య విడివిడిగా మూడు ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. వెంకటమ్మ నివాసం ఉండే ఇంట్లో సోమవారం రాత్రి వంట చేసుకున్నారు. రాత్రి భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో వెంకటమ్మ తన ఇంట్లో లైట్ ఆన్ చేశారు. అయితే అప్పటికే గ్యాస్ లీకేజీ కారణంగా ఒక్కసారిగా అధిక పీడనం కారణంగా మంటలు చెలరేగాయి. ఘటన జరిగిన ఇంటిగోడపారును ఆనుకుని పక్కనే ఉండే మృతురాలి కుమారుడు సుబ్బరాయుడు ఇల్లు గ్యాస్ లీకేజీవల్ల ఏర్పడిన అధిక పీడనంవల్ల శ్లాబ్ కుప్పకూలడంతో బాలుడు దినేష్ (10) శిథిలాల మధ్య ఇరుక్కుపోయి మరణించాడు.

**చుట్టపు చూపుగా వచ్చి గాయాలపాలు**

సుబ్బరాయుడు ఇంట్లో తన భార్య రామలక్ష్మి, మరో కుమారుడు కార్తీక్ ఉంటున్నారు. వారింటికి చుట్టపు చూపుగా వచ్చిన సుబ్బరాయుడు బంధువులు బేతంచెర్ల మండలం వెంకటగిరికి చెందిన సుబ్బమ్మ, ఆమె కుమారుడు రాములు కూడా తీవ్రంగా గాయపడ్డారు. అలాగే మృతురాలి మరో కుమారుడైన లింగమయ్య ఇల్లు కూడా అధికపీడనం ధాటికి కుప్పకూలింది. ఈ ఇంట్లో ఉన్న లింగమయ్యతోపాటు భార్య వెంకటేశ్వర మ్మ, సుశాంత్, సుధీర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న నంద్యాల రూరల్ తహసీల్దార్ పత్తి శ్రీనివాసులు, తాలుకా సీఐ ఈశ్వరయ్య, అగ్నిమాపక దళ అధికారి యోగేశ్వరరెడ్డి సిబ్బందితో చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలకింద చిక్కుకున్న వెంకటమ్మ, దినేష్ మృతదేహాలను మూడు గంటల పాటు శ్రమించి వెలికి తీశారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. అనంతరం ప్రమాద తీవ్రతను అంచనా వేశారు. రూ.24లక్షల ఆస్తినష్టం జరిగిందని అగ్నిమాపక దళ అధికారి తెలిపారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**సుబ్బరాయుడు కుటుంబంలో విషాదం**

సుబ్బరాయుడుకు ఇద్దరు సంతానం. వారిలో పెద్ద కుమారుడు కార్తీక్. చిన్న కుమారుడు దినేష్. పెద్ద కుమారుడు కార్తీక్‌కు చిన్నప్పుడే గుండెకు రంధ్రం పడటంతో దాతల సహాయంతో ఆపరేషన్ చేయిం చారు. అయినా పూర్తిస్థాయిలో మెరుగైన ఆరోగ్య పరిస్థితి లేకపోవడంతో ఇప్పటికీ నెలనెలా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ మనోవేదన పడేవాడు. అయితే మంగళవారం తెల్లవారుజామున జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనలో చిన్న కుమారుడు దినేష్ మృతిచెందడంతో సుబ్బరాయుడు రోదన గ్రామస్థులకు కంటతడి పెట్టిం చింది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న చిన్న కుమారుడిని పోగొట్టుకొని అనారోగ్యంతో ఉన్న పెద్ద కుమారుడి ఆరోగ్య పరిస్థితిని తలచుకుంటూ సుబ్బరాయుడు దంపతులు కుమిలిపోతున్నారు.

## గ్యాస్ సిలిండర్లు పేలి గుడిసెల దగ్ధం

- కట్టుబట్టలతో మిగిలిన బాధితులు



కాలిపోతున్న గుడిసెలు

**ఆదోని, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని గణేష్ సర్కిల్ సమీపంలోని జాలర్ల వీధిలోని రెండు గ్యాస్ సిలిండర్‌లు పేలి రెండు పూరి గుడిసెలు దగ్ధం అయ్యాయి. వివరాలివీ.. జాలర్ల కాలనీలో నివాసముంటున్న గంగమ్మ తెల్లవారుజామున నాలుగు గంటలకే వంట పని ముగించుకొని కూలీ పనులకు వెళ్లింది. ఉదయం ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న గంగమ్మ చెల్లెలు లక్ష్మి గుడిసెకు కూడా మంటలు వ్యాపించాయి. ఆ ఇంట్లో ఉన్న సిలిండర్ కూడా ఒకసారిగా పేలింది. గంగమ్మ భర్త నెల రోజుల క్రితం చనిపోయారు. ఆమెకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరు కూడా గంగమ్మ వెంట వెళ్లారు. లక్ష్మి భర్త ఎనిమిది నెలల క్రితం భర్త చనిపోయారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిద్దరూ లక్ష్మి పనికి వెళ్లడంతో ఆమె వెంటే వెళ్లారు. రెండు గుడిసెల్లో ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టు బట్టలతో మిగిలామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. స్థానికులు మాట్లాడుతూ అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేస్తే త్వరగా లిఫ్ట్ చేయలేదని ఆరోపించారు. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించి ఉంటే ఇంత పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం సంభవించి ఉండేది కాదని అన్నారు.

## సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు మెమో

**కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ పరిధిలో పన్ను వసూళ్లలో అలసత్వం వహించినందుకు 103 మంది సచివాల య అడ్మిన్ సెక్రటరీలకు అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి. కృష్ణ మెమో జారీ చేశారు. కుళాయిలు, దుకాణాల పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించడంతో జారీ చేశారు. 23 మంది సెక్రటరీలు ఒక్క పైసా కూడ వసూలు చేయలేదు. మిగిలిన 70 మంది 50 శాతాని కంటే తక్కువగా వసూలు చేశారు. ఈ మేరకు పన్ను వసూళ్లలో పురోగతి పెంచాలని ఏసీ ఆదేశించారు.

## దొంగనోట్ల కేసులో నలుగురికి జైలు శిక్ష

**నంద్యాల క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** బండిఆత్మకూరు పోలీస్‌స్టే షన్‌లో 2017లో నమోదైన దొంగనోట్ల కేసులో నిందితులు నలుగురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.8వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ ఏఎస్‌జే కోర్టు జడ్జి రాధారాణి మంగళవారం తీర్పునిచ్చారు. కేసులో నిందితులైన బండిఆత్మ కూరు మండల కేంద్రానికి చెందిన షేక్ రషీద్, సుధాకర్, కరీమ్, వెంకటేశ్వర్లు 2017లో మండలంలో దొంగనోట్లు చెలామణి చేస్తుండగా బాధితులు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నలు గురు నిందితుల నేరం రుజువు కావడంతో నలుగురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.8వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. కేసులో మొత్తం ఆరుగురు నిందితులు ఉండగా కేసు విచారణ సమయంలో ఇద్దరు నిందితులు మృతిచెందారని పోలీసులు తెలిపారు. జడ్జి తీర్పుతో ముద్దాయిలను నంద్యాల సబ్ జైల్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల చోరీ



తాళం పగులగొట్టిన దృశ్యం

**నందికొట్కూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని మారుతి నగర్‌లోని ఓ ఇంట్లో మూడు సిలిండర్లు దొంగతనానికి గురయ్యాయి. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హసీనా అనే మహిళ పిల్లలతో కలిసి హైదరాబాదులోని బంధువుల ఇంటికి వెళ్లారు. తలుపులు తెరుచుకొని ఉండడాన్ని గమనించిన పక్కింటి వారు ఆమెకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె హైదరాబాదు నుంచి వచ్చి చూస్తే ఇంట్లో రెండు నిండు సిలిండర్లు, ఒక ఖాళీ సిలిండర్ దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మహానందిలో చిరుత సంచారం



చిరుత పాదముద్రలు

**మహానంది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్ర పరిసరాలలో మంగళవారం ఉదయం చిరుతపులి సంచారాన్ని చూసిన ఉపాధి కూలీలు పరుగులు తీశారు. నిత్యాన్నదాన సత్రం వెనుక కాల్వలో పనులు నిర్వహిస్తున్న ఉపాధికూలీలకు చిరుత అడుగులు కనిపించాయి అలాగే సుదూరప్రాంతంలో చిరుత కనిపించడంతో బయాందోళతో పరుగులుతీశారు. ఈ విషయాన్ని పీల్డ్ అసిస్టెంట్ సురేష్ ఉన్నతాదికారులకు తెలుపడంతో పనులు నిలిపివేసి ఉపాధి కూలీలను ఇళ్లకుపంపారు.

## మహమ్మద్ షరీఫ్‌ను కలిసిన తిక్కారెడ్డి

**కర్నూలు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు మహమ్మద్ షరీఫ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో పాటు నాయకులు కలిశారు. అనంతరం వర్సిటీలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.



షరీఫ్‌ను సన్మానిస్తున్న తిక్కారెడ్డి

## ఆకతాయిల వికృత చేష్టలు

**మహానంది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** ఆలయ పరిసరాలలోని కోనేటిలో పుణ్యస్నానాలు చేస్తున్న మహిళాభక్తుల పట్ల కర్నాటకు చెందిన కొందరు ఆకతాయులు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిసింది. మంగళవారం హైదరాబాదుకు చెందిన విజయ్ కుటుంబసభ్యులు దర్శనంకోసం మహానందికి వచ్చారు. ముందుగా కోనేటిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తుల పట్ల కర్నాటకు చెందిన కొందరు ఆకతాయులు కోనేరులో అసభ్యకరంగా ప్రవర్తించి ఫొటోలు తీయడానికి గమనించిన మహిళలు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల ఆకతాయుల వద్ద ఉన్న సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వెంటనే ఆకతాయులు తమ వాహనంలో పరారయ్యారు.

## వలసల నివారణకు చర్యలు తీసుకోండి

- సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయండి
- కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు కలెక్టరేట్, జనవరి 28(ఆంధ్రజ్యోతి):** అధికారులు అలసత్వం వీడి వలసల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎంపీడీవో ఉపాధి హామీ ఏపీడీలు, ఏపీవోలను ఆదేశించారు. మంగళవారం ఉపాధి హామీ పథకం అమలు, వలసల నివారణ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వలసలు వెళ్తున్న గ్రామాలకు ఏపీవోలు, ఎంపీడీవోలు టీమ్‌లుగా వెళ్లి కూలీలతో మాట్లాడి ఉపాధి హామీ పనుల కల్పన, వేతనం గురించి వివరించా లన్నారు. అట్లాగే వలసల వల్ల పిల్లల చదువులకు భంగం కలుగుతుందని అవగాహన కల్పించాలన్నారు. వారికి రెండు వారాల్లో పూర్తి స్థాయిలో పనులు కల్పించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు చేయాలని అన్నారు. ఉపాధి హామీ ఏపీడీలు సక్రమంగా పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్ల వారిగా ఈ రెండు నెలల యాక్షన్ ప్లాన్‌ను బుధవారంలోపు సమర్పించాలని ఏపీడీలను ఆదేశించారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీవోలు పాల్గొన్నారు.

## తిరుపతి బాధితురాలికి పరిహారం



బాధితురాలికి చెక్కు ఇస్తున్న మంత్రి భరత్

**కర్నూలు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి):** వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతి తొక్కిసలాట బాధితులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పరిహారం అందజేశారు నగరంలోని తన కార్యాలయంలో ఆలూరుకు చెందిన బోయ వెంకటలక్ష్మికి రూ. 2 లక్షల చెక్‌ను అందజేశారు. టీటీడీ సభ్యుడు మల్లెల రాజశేఖర్, ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌తో కలిసి చెక్‌ను అందజేశారు.

## ఆదర్శ గ్రామాలే లక్ష్యం

- వీడియో కాన్ఫరెన్సులో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు

**కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోని అన్ని గ్రామాలను బహిరంగ మల విసర్జన రహిత ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం విజయవాడ నుంచి ఆయన సీఈఓ, డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్, పీడీ డ్వామా, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జడ్పీ మినీ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ, జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి, డీపీఓ భాస్కర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఇంటింటి సర్వే చేయించాలని అవసరమైన స్థల లభ్యత ఉన్న చోట వ్యక్తిగత కంపోస్టు, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా సర్వే చేయించి ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌బీఎంలతో వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సామాజిక సోక్ పిట్స్‌ను ఏర్పాటు చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ మార్చి 31లోపల ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.

## క్వింటం వాము రూ.23,111

- క్రమంగా పెరుగుతున్న ఎండుమిర్చి ధర



కర్నూలు యార్డుకు వచ్చిన వాము

**కర్నూలు అగ్రికల్చర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మార్కెట్ యార్డులో వాము ధర రోజురోజుకు పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డుకు కర్ణాటకతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు విక్రయానికి తెచ్చారు. గరిష్ఠ ధర క్వింటానికి రూ.23,111, మధ్యస్థ ధర రూ.13,569, కనిష్ఠ ధర రూ.5,231 ధర అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.5,719, మధ్యస్థ ధర రూ.4,449, కనిష్ఠ ధర రూ1,222 పలికింది. ఎండుమిరపకాయలకు గరిష్ఠ ధర రూ.13,499, మధ్యస్థ ధర రూ.12,109, కనిష్ఠ ధర రూ.1,299కు అమ్ముడుపోయింది. అలాగే పూలవిత్తనాలకు గరిష్ఠ ధర రూ.4,819, మధ్యస్థ ధర రూ.4,769, కనిష్ఠ ధర రూ.4,769 రైతులకు దక్కింది. ఆముదాలు గరిష్ఠ, మధ్యస్థంగా రూ.5,621, కనిష్ఠ ధర రూ.రూ.5209 వచ్చింది. కందులకు గరిష్ఠ ధర రూ.7,801, మధ్యస్థం రూ.6,689, కనిష్ఠ ధర రూ.రూ.2,100 రైతులకు చేరింది. శనగలకు గరిష్ఠ ధర రూ.5,900, మధ్యస్థ ధర రూ.5,776, కనిష్ఠ ధర రూ.3,010 పలికింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.2,368, మధ్యస్థ ధర రూ.1,5885, కనిష్ఠ ధర రూ.721 దక్కింది. కొర్రలకు గరిష్ఠ ధర రూ.2,729, మధ్యస్థ ధర రూ.2,299, కనిష్ఠ ధర రూ.2,015 రైతులకు అందినట్లు సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు.

## వృత్తి విద్యతో ఉద్యోగ అవకాశాలు




విద్యార్థులతో మాట్లాడుతున్న అప్పారావు

**కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి):** వృత్తి విద్యా కోర్సులు చేసిన విద్యార్థులకు అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వృత్తి విద్య కోర్సు అప్రెంటిషిప్ అభివృద్ధి అధికారి అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం కేవీఆర్ జూనియర్ కళాశాల, బి. క్యాంపు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో వేర్వేరుగా విద్యార్థులతో మాట్లాడారు. రాబోయే ప్రపంచమంతా వృత్తి విద్యదే అని, నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువుకున్న వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ తీసుకుంటే మరింత ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్‌ఐవో గురువయ్యశెట్టి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. లాలెప్ప, బీ. క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఏపీడీ

పగిడ్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీడీ అన్వరాబేగం హెచ్చరించారు. పగిడ్యాల ఉపాధిహామీ కార్యాలయంలో ఎంపీడీవో సుమిత్రమ్మ ఆధ్వర్యంలో సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధికూలీల వివరాలు, గడ్డి పెంపకం, ఇకుండుగుంతల నిర్మాణాలు, శ్రమశక్తి సంఘల ఏర్పాటు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పనులు లేక వలసలు పోకుండా నివారించేందుకుగాను కూలీలకు అవసరమైన పనులను గుర్తించి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రైతులకు బహుళ గడ్డి పెంపకం, పండ్లతోటల పెంపకం పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో మద్దిలేటి, ఈసీ అశోక్, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

## ముగిసిన జాతీయ సాంకేతిక సదస్సు


విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న హెచ్ఓడీ

పాణ్యం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అద్వితీయ 2కె25 జాతీయ సాంకేతిక సదస్సు మంగళవారం ముగిసింది. సీఎస్ఈ (డేటా సైన్స్ ) విభాగం ఆధ్వర్యంలో నిరహించిన ఈ సదస్సులో వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సులో విద్యార్థులు పలు ఈవెంట్లలో పాల్గొన్నట్లు హెచ్ఓడి భాస్కరరావు తెలిపారు. పోస్టర్ ప్రజంటేషన్, సాంకేతిక క్విజ్, పేపర్ ప్రజంటేషన్, కోడింగ్ హ్యాకథాన్ వంటి ఈవెంట్స్ నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్, ఫ్లాష్ మాబ్ డ్యాన్స్‌లు, క్రీడలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, డీన్ డాక్టర్ రామిరెడ్డి, కోకన్వీనర్ డాక్టర్ సులేమాన్, డాక్టర్ రంగస్వామి, రతి, హెచ్ఓడి డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ కవిరాసన్, డాక్టర్ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

## మద్యపానానికి బ్రేక్

### - కూల్‌డ్రింగ్ షాపుల్లో తెరల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్మకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని పలు మద్యం దుకాణాల్లో అనుమతుల్లేకుండా గదులను ఏర్పాటు చేసి దర్జాగా మద్యపానాన్ని ప్రోత్సహిస్తున్న వ్యవహారంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన మద్యం.. చోద్యం అనే కథనానికి ఎట్టకేలకు పోలీసు, ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ప్రత్యేకించి ఆత్మకూరు పట్టణంలో మద్యం షాపులకు అనుసంధానంగా ఉండే కూల్‌డ్రింగ్ షాపుల్లో తెరలు ఏర్పాటు చేసి మద్యపానం ప్రోత్సహిస్తున్న వారిని గుర్తించి తెరలను తొలగించారు. అంతేకాకుండా మద్యం దుకాణాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచారు. మద్యం దుకాణాల నిర్వహణలో దుకాణాదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయా శాఖల అధికారులలు వెల్లడించారు.

## షాదీఖానా నిర్మాణ పనుల పరిశీలన

నందికొట్కూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ ఘర్ కం షాదీఖానా నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఛైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని షాదీఖానా నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. అదే విధంగా అప్‌స్టెర్ నిర్మాణానికి సంబంధించి ఎస్టిమేషన్‌ను సిద్ధం చేయాలని మున్సిపల్ డీ.ఈ. నాసీర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లాలు ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ ఏ.ఈ. దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

## టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి


మాట్లాడుతున్న షరీఫ్

వెలుగోడు, జనవరి28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారులు షరీఫ్, మైనార్టీ సంక్షేమ శాఖ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్ అన్నారు. మంగళవారం వారు నంద్యాల పర్యటన ముగించుకొని ఆత్మకూరుకు వెళుతూ మార్గమధ్యంలో వెలుగోడులోని ఆరబిక్ మదరసా కళాశాలను సందర్శించారు. ఇది ఆయన చదువుకున్న కళాశాల కావడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రత్యేకంగా చర్చించారు. తన గత స్మృతులను ఆయన నెమురువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట ప్రిన్సిపాల్ మహబూబ్ రహిమాన్, టీడీపీ నాయకులు మోమిన్ రసూల్, ఖలీల్, రహిమాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అబద్ధాల పార్టీ

నంద్యాల కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అబద్ధాల కోరు పార్టీ అని 20 పాయింట్స్ ప్రోగ్రాం ఛైర్‌పర్సన్ లంకా దినకర్ తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. భారతీయ జనతాపార్టీ సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాలని అన్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న రాహుల్ గాంధీ నైజంను ప్రజల ముందు తెలియపరిచేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కశెట్టి క్రిష్ణమూర్తి, డా. ఇంటి ఆదినారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.






కార్యక్రమానికి హాజరైన ప్రజలు


టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

## అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగాకు భారీ స్పందన

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 37, 38వ వార్డులలోని నందమూరినగర్, వైఎస్ఆర్‌కాలనీ, ఎస్ఆర్‌బీసీ కాలనీల సమస్యలపై అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా అనే కార్యక్రమాన్ని ఆంధ్రజ్యోతి మంగళవారం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. కాలనీల్లో ఉన్న సమస్యలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. గత కొన్నేళ్ల నుంచి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి కాలనీల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ హామీ ఇచ్చారు.

# రక్షణ లేని వంతెనలు

### ● ప్రమాదాల బారిన ప్రజలు ● పట్టించుకోని కేసీ అధికారులు


రక్షణలేని పరమటూరు కుందూనది వంతెన

బండిఆత్మకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో కుందూనది వంతెనలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. మండలంలోని బండిఆత్మకూరు, భోజనం, కాకనూరు, పరమటూరు గ్రామాలకు వెళ్లే దారుల్లో కుందూ నదిపై వంతెనలు ఉన్నాయి. ప్రస్తుతం పెరిగిన జనాబా, వాహనాల వల్ల వంతెనల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వంతెనలకు ఇరువైపులా ఎలాంటి రక్షణలు లేకపోవడంతో ఇటీవల బండిఆత్మకూరు వద్ద రెండు ప్రమాదాలు వంతెనపై నుంచి వ్యక్తి నది నీటిలోపడి ప్రాణాలతో బయటపడటం, ఎద్దుల బండి వంతెన పై నుంచి నదిలో పడబోతే సదరు రైతు చాకచక్యగా ఎద్దులను వంతెనపైకి మళ్లించడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది.. అలాగే పరమటూరు వంతెన వద్ద ఎన్నో మార్లు పర్యాటకులు, చేపల వేటదారులు ప్రమాదాలబారిన పడిన సంఘటనలు ఉన్నాయి. భోజనంగ్రామం వద్ద గతంలో ద్విచక్ర వాహన ప్రమాదం చోటు చేసుకుంది. కాకనూరు వద్ద సైతం ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా కెసీ కెనాల్ అధికారులు స్పందించి వంతెనల వద్ద రక్షణ చర్యలు తీసుకుని కంచెలు లేక చిన్నపాటి ప్రహారీలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


భోజనం, పెద్దదేవళాపురం మధ్య ఉన్న కుందూ వంతెన

### ప్రమాదాలు నివారించాలి



మాగ్రామంలో సుమారు 20 వేల జనాభా ఉంది. కుందూ నది వంతెనపై ప్రతి రోజు వందలాది మంది రాకపోకలు చేస్తుంటారు. వంతెనకు ఇరువైపులా ఎలాంటి రక్షణ లేదు. ఇంతేకాకుండా కాలేజిలు, హైస్కూల్‌కు విద్యార్థులు ఈ వంతెనపైనే వెళ్తున్నారు. ఏదైనా అదమరిస్తే అంతే సంగతులే. వంతెనకు కంచె ఏర్పాటు చేయాలని అనేక సార్లు అధికారులను కోరినా లాభం లేదు.

- రఘు, బండిఆత్మకూరు



### రక్షణ చర్యలు చేపట్టాలి



భోజనం గ్రామ వంతెనపై గడివేముల, వెలుగోడు, బండిఆత్మకూరు మండలాల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. కుందూనది వంతెనల వద్ద కెసీ కెనాల్ అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు కూడా పెట్టలేదు. దీంతో ద్విచక్రవాహనాలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలం అయితే వాగు పొంగిపొర్లినప్పుడల్లా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

- శ్యాంసన్, భోజనం

## సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ ఛైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గతంలో మాదిరిగా కాకుండా ఇటు టీడీపీ, అటు వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఎలాంటి వాదోపాదాలు లేకుండా సమావేశం ముగిసింది. పెండింగ్ బకాయిదారుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పెండింగ్ పన్నులను వసూళ్లు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేశారు.

**● అధికారుల తీరుపై మండిపడిన కౌన్సిలర్లు...**

కౌన్సిల్ సమావేశానికి హాజరైన పలువురు టీడీపీ, వైసీపీ అనే తేడా లేకుండా కౌన్సిలర్లందరూ మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలు, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. ఒక్క దౌలత్ విషయమై కాకుండా ఇతర మాజీ సైనికుల విషయంలో కూడా ఇదే తరహాలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. కొందరు ఇళ్లకు పన్నులు వేయడం లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. రెవెన్యూ, టీపీవో, మరణ ధృవీకరణ విభాగాల్లోని సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్

**● తీర్మానించిన 23 అంశాల్లో ప్రధానమైనవి...**

- మాజీ సైనికులకు పన్నుల విషయంలో సడలింపు ఇవ్వాలి.
- మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ చేయాల్సిందే.
- మున్సిపాలిటీ స్థలాలు కబ్జాకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి.
- కుక్కలు, దోమల బెడద ఉందని, తక్షణమే చర్యలు చేపట్టాలి.
- తాగునీటి, ఇంటి గుత్తలు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దెల విషయంలో నిర్లక్ష్యం తగదని, అవసరమైతే స్పెషల్ డ్రైవ్ ద్వారా పెండింగ్ బకాయిలు వసూలు చేయాలి.
- శానిటరీ సిబ్బంది కొరత లేకుండా చూడాలి.
- కోర్టు పరిధిలో ఉండే నివేదికను పక్కాగా తయారు చేయాలి.
- చనిపోయిన శానిటరి వర్కర్లు కుటుంబంలోకి ఒకరి ఉద్యోగ అవకాశం కల్పించాలి.
- కార్గిల్‌వీరుడు దౌలత్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలి.
- రిజిస్ట్రేషన్‌శాఖ నుంచి వచ్చిన నగదు తిరిగి చెల్లించండి. అదే తరహాలో వారి పెండింగ్ బకాయిలను కూడా వసూలు చేయాలి.
- మహిళల మరుగుదొడ్లకు తక్షణమే కాంపౌండ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.


కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- ఉర్దూ స్కూల్‌కు గ్రౌండ్ సదుపాయం కల్పించాలి.
- మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు వస్తే.. నష్టపోయే బాధితులకు తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

**● నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకుంటాం..**

కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. పెండింగ్ బకాయిలు, షాపింగ్ కాంప్లెక్స్ విషయంలో ప్రత్యేక దృష్టిసారిస్తాం. గతంలో అమృత్ సర్ పేరుతో వేసిన కొళాయి కనెక్షన్ల పెండింగ్ బకాయిలపై కొంత సందిగ్ధత ఉంది. అధికారులు, సిబ్బంది విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం. కొత్త ఇంటి పన్నులపై సమగ్రంగా చర్చించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

**● మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయండి..**

అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు అందరూ కలిసి మున్సిపాలిటి అభివృద్ధికి కృషి చేయాలి. రూ. కోట్లలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరగా వసూలు చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి వినియోగించండి. మున్సిపాలిటీ స్థలాలు అక్రమణ కాకుండా చర్యలు తీసుకోండి. కౌన్సిలర్ల సమస్య లపై దృష్టి పెట్టి సహకరించండి.

షేక్ మా బున్నిసా, మున్సిపల్ ఛైర్ పర్సన్

## మహిళకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

బండి ఆత్మకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ కోడూరు గ్రామంలో వివాహిత తెలుగు శిరీషకు మాజీ సర్పంచ్ వడ్డు వెంకటసుబ్బారెడ్డి కుమారుడు, టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి , చౌటుపల్లి సుధాకర్ రూ.6వేల ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం గ్రామంలోని తెలుగు రాజు ఇంటికి వెళ్లి ఇటీవల నద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించుకున్న శిరీషకు తమ వంతు నగదు సహాయాన్ని వారు అందజేశారు.

## శ్మశాన వాటికకు ప్రత్యామ్నాయం చూపండి

పాములపాడు జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైవేలో ముస్లిం మైనార్టీల శ్మశాన వాటిక పోవడంతో ప్రత్యామ్నాయం చూపాలని తుమ్మలూరు కృష్ణారావు పేట ముస్లింలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్, రాష్ట్ర మైనారిటి కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ మౌలానా అహ్మద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వహీద్‌హుసేన్‌ను కోరారు. మంగళవారం పాములపాడు మండలంలో పర్యటించేందుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వాహనాన్ని అడ్డగించి ముస్లింలు తమ సమస్యను విన్నవించారు. తుమ్మలూరు, కృష్ణారావు పేట గ్రామాలకు చెందిన శ్మశాన వాటిక జాతీయ రహదారి నిర్మాణంలో పోయిందని, దీంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాననని హామీ ఇచ్చారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే బుడ్డా



ఆత్మకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఐటీ మంత్రి నారాలోకేశ్‌ను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన బన్నూరు రామలింగారెడ్డి నారాలోకేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధిపై మంత్రికు ఎమ్మెల్యే చర్చించారు. వీరి వెంట శ్రీశైలం మండల టీడీపీ ఇన్‌చార్జి యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

## వాహనదారుడిపై దొంగల దాడి

### - కర్రలు, కత్తులతో బెదిరించి..


చికిత్స పొందుతున్న ప్రభాస్

నంద్యాల, క్రైం, జనవరి 28, (ఆంధ్రజ్యోతి) : నంద్యాల రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో రైతు నగర్ సమీపం మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఏకంగా కర్రలు, కత్తులతో బెదిరించి అతని వద్ద ఉన్న డబ్బులు లాక్కొనిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన ప్రభాస్ అనే కారు డ్రైవర్ నంద్యాల నగరం నుంచి రైతు నగర్ సమీపంలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో వాహనంలో ప్రయాణిస్తుండగా.. కొందరు దొంగలు కారును అటకాయించారు. కారులో నుంచి ప్రభాస్ దిగకపోవడంతో కారు అద్దాలను కర్రలతో ధ్వంసం చేశారు. ఆ తర్వాత డ్రైవర్‌ను బయటకు లాగి కత్తులతో బెదిరించి హడలెత్తించారు. ఆపై దాడికి పాల్పడి అతడి వద్ద ఉన్న రూ. 3000 నగదును లాక్కుని పారిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రభాస్ పోలీసులు అందిన సమాచారం మేరకు.. నంద్యాల సర్వజనాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. గత వారం రోజుల శాంతిరామ్ మెడికల్ కళాశాల సమీపంలో ఓ దంపతులపై కొందరు దుండుగుల దారి దోపిడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఇలా వరస దారి దోపిడీలతో నంద్యాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సభలో తొమ్మిది తీర్మానాలు ఆమోదం


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్

ఆత్మకూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఛైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తొమ్మిది తీర్మానాలను ఆమోదించారు. ఇందులో ప్రధానంగా శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న నలుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అప్కాస్‌లో పని చేసేందుకు తీర్మానించారు. అలాగే జిమ్ పరికరాల ఏర్పాటు, ఐ అవ్ ఆత్మకూరు ఐకాన్ ఏర్పాటుకు రూ.1,64,886 టెండర్ ఖర్చులను ఆమోదించారు. అదేవిధంగా ఎస్సీజీపాలెంలోని ఎస్సీ స్మశాన వాటిలో రూ.99వేలతో జీఎల్ఎస్ఆర్ ట్యాంకు నిర్మిణంతో పాటు కొత్త మోటారు, సామగ్రిని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. పట్టణంలోని ఆక్రమణల్లో భాగంగా తొలగించి వృక్షాల కలపను బహిరంగ వేలం వేయాలని ఆమోదించారు. హౌసింగ్ లేఅవుట్స్ నందు నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు పన్ను వేసేందుకు సదరు కాలనీల పేర్లు పెట్టాలని తీర్మానించారు. వీరభద్ర థియేటర్ ఏరియాలోని రిటైర్డు సర్వీసు మెన్ మహ్మద్ హుషం ఆస్తి పన్ను మినహాయించాలని నిర్ణయించారు. పట్టణంలోని కేజీరోడ్డు డివైడర్ పెయింటింగ్, క్లీనింగ్ కొరకు రూ.816905 బిల్డర్‌కు కేటాయించాలని ఆమోదించారు. 2021 ఆగస్టు 8న చిలుక రవి అనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. ఇతనికి జీవోనెం.25 ప్రకారం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్న అర్జీపై తదిపరి ప్రక్రియను కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

**బడ్జెట్ అంచనాలకు ప్రతిపాదనలు :**

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 2025-26 బడ్జెట్ అంచనాలపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో సాధారణ జమలు రూ.9,75,07,000, మూలధనం రూ.16,81,00,000లతో పాటు ప్రారంభ నిల్వతో కలిపి రూ.33,61,31,500 రాబడిగా అంచనా వేశారు. అలాగే ఖర్చులకు సంబంధించి సాధారణ ఖర్చు రూ.6,97,05,000, మూలధనం ఖర్చు రూ.9,02,70,000తో కలిపి ముగింపు నిల్వ రూ.15,61,56,500 అంచనాలను తయారు చేశారు.

## హామీలు నెరవేర్చాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

**డోన్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల సమయంలో వలంటీర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో వలంటీర్లతో కలిసి పాత బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పదివేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయలకొండ నాగరాజు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, వలంటీర్లు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


కావ్యశ్రీ

**దొర్నిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని దొర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ.కావ్యశ్రీ జాతీయస్థాయి చపకత్రక పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 28న జూనియర్ చపకత్రక పోటీలో పాల్గొని గెలుపొందడంతో జాతీయస్థాయికి ఎంపికైంది. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2వరకు నంద్యాల జిల్లా రామకృష్ణ పీజీ కళాశాల ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థిని కావ్యశ్రీని, పీడీ దేవేంద్రను ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందించారు.

## గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బీసీ ఇందిరమ్మ

**బనగానపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో పుల్లారెడ్డి జ్ఞాపకార్థం వారి స్నేహితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను బీసీ ఇందిరమ్మ ప్రారంభించారు. క్రికెట్ క్రీడాకారులను బీసీ ఇందిరమ్మ పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, సంగు శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి, గుళ్లగుర్తి హరి, విజయభాస్కర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పైరు పరిశీలన


దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**ప్యాపిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఊటకొండ గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను మంగళవారం నంద్యాల ఆర్ఏఆర్ఎస్ వ్యవసాయ శాస్త్రవేత్తలు రామక్రిష్ణారావు, రమణమ్మ, వెంకటరమణ, సుజాత పరిశీలించారు. ఏ రకం విత్తనాలు సాగు చేశారో, ఎక్కడ కొనుగోలు చేశారో వారు రైతులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలను ల్యాబ్‌లో పరిశీలించి పైరు ఏ కారణం వల్ల దెబ్బతిన్నదో తెలియజేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు కలిగిన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం కూడ నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రాజేష్, రైతుల పాల్గొన్నారు.

## రశీదు తప్పనిసరిగా పొందండి

**రుద్రవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** దుకాణాల్లో ఎరువులు కొనుగోలు చేస్తే రశీదు తప్పనిసరిగా రైతులు పొందాలని ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల బస్తాలను తూకం వేసి పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుమందుల రైతులకు రశీదు ఇవ్వాలని సూచించారు. ఆ ఎరువులు అమ్మిన వెంటనే ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో నాగేంద్రప్రసాద్, ఏఈవో రాజు పాల్గొన్నారు.

## నారసింహా.. నమో నమః

**రుద్రవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** నారసింహా.. నమో నమో అంటూ స్మరిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం మండలంలోని ముత్తలూరు గ్రామంలో పార్వేట ఉత్సవమూర్తులు పూజలందుకున్నారు. పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి ప్రహ్లాద వరదస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. నేడు నల్లవాగుపల్లెలో పల్లకి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

## ర్యాగింగ్ వద్దు.. చదువే ముద్దు: సీఐ

**కోవెలకుంట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** ర్యాగింగ్ వద్దు చదువే ముద్దు అని నంద్యాల మహిళా పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మద్దిలేటిస్వామి, రామలింగారెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక సమరసత యాత్ర ప్రారంభం

**బనగానపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక సమరసత యాత్ర మంగళవారం ప్రారంభమైనట్లు బనగానపల్లె విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కార్యదర్శి గెలివి ఓబుళరెడ్డి తెలిపారు. రథం పూజ అనంతరం స్వామీజీలు శివయోగేంద్ర సరస్వతి, అభినవ శంకరానంద స్వామి, జ్ఞానానందస్వామి, సాయిరెడ్డి, సీహెచ్ నాగిరెడ్డి, లాయర్ మాధవరెడ్డి, జగన్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. రథయాత్ర అవుకు, కొలిమిగుండ్ల, మీదుగా కడప జిల్లా బ్రహ్మంగారి మఠం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు.

## శనగలో పంట కోత ప్రయోగం

**కొలిమిగుండ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ఎర్రగుడి గ్రామంలో రైతులు సాగు చేసిన పప్పు శనగ పంటలో అధికారులు మంగళవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఎకరానికి సుమారు నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు ఏఎస్‌వో భాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, సందీప్, రైతులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా భవన నిర్మాణం

- మైనార్టీ ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి రూ.3.92 కోట్లు మంజూరు
- ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు


పెద్దవంగలిలో అసంపూర్తిగా ఉర్దూ కళాశాల భవనాలు

**చాగలమర్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** గత వైసీపీ పాలనలో చేపట్టిన మైనార్టీ ఐటీఐ కళాశాల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. భవన పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో భవనాల చుట్టూ ముళ్ల కంపలతో నిండుకున్నాయి. వైసీపీ పాలనలో రూ.3.92 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు నాటి ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నాటి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి భూమి పూజ చేశారు. హాస్టల్ వసతి, విద్యాబోధన కోసం 16 గదులు ఉండేలా భవన పనులు చేపట్టారు. ఫ్లోరింగ్ చేయకుండా వదిలేశారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. పాలకులు, అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న మైనార్టీ ఐటీఐ కళాశాల భవన పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకరావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# రైతుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సాగునీటి సంఘాల అధ్యక్షులు

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 28(ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ కాల్వల అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు చివరి ఆయకట్టు రైతులకు సైతం సాగునీరు అందిస్తామన్నారు. ఎస్ఆర్‌బీసీ డిస్ట్రిబ్యూటరీ-8 కమిటీ చైర్మన్ అనంత రామసుబ్బారెడ్డి, అల్లూరు, తుడుమలదిన్నె, కొండ సంకేసుల సాగునీటి సంఘాల అధ్యక్షులు విజయ భాస్కర్‌రెడ్డి, పేరెడ్డి రామసుబ్బా రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అల్లూరు టీడీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వారిని పూలమాలలతో సన్మానించారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత**

ఉయ్యాలవాడ మండలం రూపనగుడి గ్రామానికి చెందిన నందారపు వెంకట సుబ్బారెడ్డి కుటుంబానికి రూ.62 వేలు, అల్లూరుకు చెందిన రమాదేవికి రూ.97 వేలు, శిరివెళ్ల మండలం వనికెందిన్నెకు చెందిన తోకల మాధవికి రూ.40 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డలో మంగళవారం అందజేశారు. సీఎం సహాయ నిధి నుంచి సహకారం అందడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మురళి పాల్గొన్నా రు.

**ఎమ్మెల్యేను కలిసిన విద్యుత్ ఏఈలు**

శిరివెళ్ల, రుద్రవరం మండలాలకు నూతనంగా వచ్చిన విద్యుత్‌శాఖ ఏఈలు నాగార్జున, సునీల్ కుమార్‌లు ఆళ్లగడ్డ ఏడీఈ రవికాంత్ చౌదరితో కలిసి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్‌రామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## జిల్లాకు మరో 11 మద్యం షాపులు

- ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు


మాట్లాడుతున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ వి.రాముడు

**డోన్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లాకు మరో 11 మద్యం షాపులు మంజూరు అయినట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వి.రాముడు అన్నారు. మంగళవారం డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఈడిగ కులస్థులకు మద్యం షాపులను కేటాయిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాకు 11 మద్యం షాపులు కేటాయించగా.. వాటిలో ఈడిగ సబ్ క్యాస్ట్ కులస్థులకు ఏడు, గౌడ్లకు మూడు, గౌడ కులానికి చెందిన వారికి ఒకటి కేటాయించిందన్నారు. ఆసక్తి గల ఈడిగ కులస్థులు మద్యం షాపులకు రూ.2 లక్షల చొప్పున ఆన్‌లైన్ ద్వారా చెల్లించి టెండరులో పాల్గొనాలని కోరారు. టెండరు కౌంటర్ ఆయా ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేశామన్నారు. వచ్చే నెల 5వ తేదీలోపు మద్యం షాపులకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. 7న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలను ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. డోన్ రూరల్ పరిధిలో ఒకటి, పట్టణ మున్సిపాలిటీ పరిధిలో ఒక మద్యం షాపు ఈడిగ సబ్ క్యాస్టుకు కేటాయించిందన్నారు. సమావేశంలో డోన్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐలు, సోమశేఖర్, దౌలత్‌ఖాన్ తదితరులున్నారు.

## హెల్మెట్ ధరించాలి : డీఎస్పీ శ్రీనివాసులు


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

**డోన్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని డీఎస్పీ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని కోరారు. ఆర్టీవో క్రాంతి కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్రంలో 18వేలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. వాటిలో ఏడువేలు మంది మృతి చెందారన్నారు. వాటిలో 40 శాతం ద్విచక్రవాహనాల ప్రమాదాలు ఉన్నాయని తెలిపారు. హెల్మెట్లు ధరించడం వల్ల ప్రమాద తీవ్రత తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు, ఆర్టీవో సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీ చరిత్రను తిరగరాసిన యువగళం

- రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి

**కోవెలకుంట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** ఆంధ్రప్రదేశ్‌లో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఏపీ రాజకీయాలను తిరగరాసిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ అరాచక పాలనపై సమర శంఖారావం పూరించి రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పి చరిత్రాత్మక యువగళం పాదయాత్రకు రెండు సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. ప్రజల కన్నీళ్లు తుడుస్తూ కష్టాలు వింటూ సాగిన యువగళం పాదయాత్ర విజయవంతం అయిందన్నారు. రాష్ట్రంలో మళ్లీ రామరాజ్యం స్థాపించిన ఘనత యువనేత లోకేశ్‌కు దక్కిందన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**బేతంచెర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ, సిద్దప్పగుడి, గౌరిపేట మఠం ప్రాంతం, దుర్గాపేట, బైటిపేట కాలనీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఏఈ దుర్గా ప్రసాద్

**సంజామల, జనవరి 28(ఆంధ్ర జ్యోతి):** గ్రామాల్లోని సమస్యలు అభివృద్ధ ప్రజా ప్రతినిధులు విస్మరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం సైతం గైర్హాజరవుతున్నారు. మంగళవారం సంజామల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ సైతం హాజరు కాకపోవడంతో సభలో సమస్యల ఊసే లేదు.

**- కోరం లేక గంటపాటు నిరీక్షణ**

మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు హాజరైనప్పటికీ కోరం లేక ఎంపీడీవో సాల్మన్ గంటపాటు నిరీక్షించారు. అదే సమయానికి ముదిగేడు ఎంపీటీసీ , మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి హాజరుకావడంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల ప్రగతి గురించి అధికారులు వివరించారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**కోవెలకుంట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కోవెలకుంట్ల పట్టణంలో వెలగటూరు రహదారిలో బ్రిడ్జి సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్వామినగర్‌కు చెందిన చిన్నదస్తగిరి (24) ట్రాక్టరు డ్రైవరుగా పనిచేస్తుండేవాడు. మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తలు ఘర్షణ పడి విడిగా ఉండేవారు. సోమవారం ఇంట్లో ఇక మందు తాగను, బాగుంటానని చెప్పి బయటికి వెళ్లి బ్రిడ్జి పక్కన శవమై కనిపించాడని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే చిన్నదస్తగిరి మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కోవెలకుంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

## తండ్రిపై కొడుకు దాడి

**కోవెలకుంట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** తండ్రిపై కొడుకు పలుగుతో దాడి చేయగా రక్తగాయాలైన సంఘటన బిజినవేముల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గుద్దేటి వెంకటసుబ్బారెడ్డి కొడుకు గుద్దేటి దివాకర్‌రెడ్డి ఆస్తి విషయంలో చిన్నపాటి ఘర్షణ పడ్డారు. దాంతో పలుగుతో తండ్రి తలపై దాడి చేయగా తలకు, చేతికి గాయాలయ్యాయి. గాయపడ్డ వెంకటసుబ్బారెడ్డిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

## కారు బోల్తా.. మహిళ మృతి

**ప్యాపిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పోతుదొడ్డి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా కదిరికి చెందిన కార్తీక్, శ్రీలత(34) దంపతులు కూతురుతో కలిసి పని నిమిత్తం కారులో హైదరాబాద్ వెళ్లారు. పని పూర్తికాగానే తిరిగి కదిరికి బయలుదేరారు. అయితే మార్గం మధ్యలోని పోతుదొడ్డి గ్రామం సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో భార్య శ్రీలత తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. భర్తకు స్వల్ప గాయాలు కాగా చిన్నారి కూతురుకు ఎటువంటి గాయాలు కాలేదు. కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

**డోన్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కేవీఎస్ కాలనీ అయ్యప్పస్వామి గుడి సమీపంలో మంగళవారం హేమలత అనే మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతురాలికి భర్త, ఒక కొడుకు, కూతురు ఉన్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు.

## గుడిసె దగ్ధం

**రుద్రవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని చిలకలూరు గ్రామంలో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైందని మంగళవారం బాధిత రైతు వెంకటరమణ వాపోయాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గుడిసె కాలింది. అందులో ఉన్న 30 జీవాలు గాయపడ్డాయి. గుడిసె కాలిపోవడంతో రూ.1.50లక్షలు నష్టం వాటిల్లింది.

## గుండెపోటుతో రైతు మృతి


మహబూబ్ బాషా (ఫైల్)

**సంజామల, జనవరి 28( ఆంధ్రజ్యోతి):** గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన సంజామలలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పేరుసోమల మహబూబ్ బాష (46) ఉదయం ఇంట్లోనే గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. 108 అంబులెన్స్‌లో కోవెలకుంట్లకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### పాల ఉత్పత్తిదారుల అభివృద్ధే లక్ష్యం

**చాగలమర్రి విజయ డెయిరీ మేనేజర్ ఈశ్వరయ్య**



**చాగలమర్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** గ్రామాలలో పాల ఉత్పత్తిదారుల అభివృద్ధే తమ లక్ష్యమని చాగలమర్రి విజయ డెయిరీ మేనేజర్ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

**ప్రశ్న:** పాలడెయిరీకి ఎన్ని లీటర్ల పాలు వస్తున్నాయి?

**జవాబు:** 80 గ్రామాల నుంచి 8,500 లీటర్ల పాలు డెయిరీకి వస్తున్నాయి.

**ప్రశ్న:** పశుదాణ, రుణ సాయం అందిస్తున్నారా ?

**జవాబు:** పశువులకు దాణను అందజేస్తున్నాం. సిటి యూనియన్ బ్యాంకు ద్వారా 15 గ్రామాల రైతులకు రూ.48 లక్షలు రుణ సాయం అందించాం.

**ప్రశ్న:** రైతులకు బోనస్ ఇస్తున్నారా ?

**జవాబు:** గ్రామాలలో 365 రోజులు పాల పోషణ ఉత్పత్తిదారులకు రూ.1.50 ఇచ్చాం. 60 గ్రామాలలోని పాల ఉత్పత్తిదారులకు బోనస్ ఇచ్చాం.

**ప్రశ్న:** కల్యాణమస్తు పథకం ద్వారా సాయం అందిస్తున్నారా?

**జవాబు:** పది మందికి రూ.10 వేలు ప్రకారం కల్యాణమస్తు అందించాం.

**ప్రశ్న:** పశుగ్రాసానికి సాయం అందిస్తున్నారా?

**జవాబు:** పాల ఉత్పత్తిదారులకు ఎకరా పశుగ్రాసం పెంపకానికి రూ.5 వేలు ఇస్తున్నాం. ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రుణ సాయం అందిస్తున్నాం.

## ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ముళ్ల కంప తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చాగలమర్రిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తొలగించిన ముళ్ల కంపలు

**చాగలమర్రి, జనవరి 28 (ఆంధ్ర జ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని దస్తగిరిస్వామి దర్గాకు వెళ్లే రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న ముళ్ల కంపలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. 'అల్లుకున్న నిర్లక్ష్యం' అన్న శీర్షిక మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ రమణయ్య ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ముళ్ల కంపలను తొలగించారు. దాంతో స్థానిక కాలనీ వాసులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ తిరుపతయ్య, లైన్‌మెన్లు, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

## పార్కింగ్ స్థలాల ఏర్పాటు



డోన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద బ్లాకులలో వేసిన సిమెంటు బెడ్డులు

**డోన్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** పట్టణం నడిబొడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పార్కింగ్ స్థలాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా డీఎస్పీ పి.శ్రీనివాసులు, పట్టణ ప్రజల సహకారంతో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఏడు బ్లాకులను పార్కింగ్ స్థలాలకు ఎంపిక చేశారు. ఈ ఏడు బ్లాకులలో సిమెంట్ బెడ్లను ఏర్పాటు చేయించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో ప్రారంభించేందుకు పోలీసులు ఏర్పాట్ల చకచకాగా చేస్తున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్‌బాబు, ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్ పనుల పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు.

## పశువైద్యశిబిరం సద్వినియోగం చేసుకోండి

**కోవెలకుంట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** కూటమి ప్రభుత్వం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని వల్లంపాడులో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు డాక్టర్ విజయలక్ష్మి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కత్తి సురేశ్‌బాబు, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఫ్ఏ-3 పరీక్షల పరిశీలన

**చాగలమర్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఏ-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో అనూరాధ తెలిపారు. మంగళవారం మండలంలోని గొడిగనూరు పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ-3 పరీక్షలను ఎంఈవో పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఓబుళపతి, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

## కుష్ఠు ప్రాణాంతకం కాదు

**చాగలమర్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** కుష్ఠు ప్రాణాంతక వ్యాధి కాదని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం మద్దూరు గ్రామంలో కుష్ఠువ్యాధి లక్షణాల కరపత్రాలను విడుదల చేశారు. ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఎల్‌సీడీ సీడీ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## 30న అహోబిలంలో సమావేశం

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 28(ఆంధ్రజ్యోతి) :** రాయల చారిటబుల్ ట్రస్ట్ అహోబిలం అన్నదాన రూముల దాతల జనరల్‌బాడీ సమావేశాన్ని ఈ నెల 30న అహోబిలంలో నిర్వహించనున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి యర్రంశెట్టి నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ ఎంవీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. అన్నసత్రంలో మొత్తం 37 గదులున్నాయని అన్నారు. దాతలతో మాత్రమే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అహోబిలం శ్రీకృష్ణదేవరాయ నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు.

## సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

**చాగలమర్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):** సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ సూచించారు. నగల్లపాడులో విషజ్వరాలుఉన్నాయన్న విషయం తెలుసుకొని వైద్యులు ఇమ్రాన్, అంజలి ఆదేశాల మేరకు గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలు సోకిన వారికి రక్తపూత పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

**కొలిమిగుండ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :** మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.